
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 351 | శనివారం 15 నవంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# వరల్డ్ ఎకనమిక ఫోరంతో ఏపీ కీలక ఒప్పందం



- ఏఐ యూనివర్సిటీ ఏర్పాటులో భాగస్వామికండి
- సీఐఐ రెండో రోజు రూ.48,430 కోట్ల పెట్టుబడులు
- శ్రీ సిటీకి 6వేల ఎకరాలు భూములిస్తాం
- సీఐఐ సదస్సు రెండో రోజూ వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబూ



**విశాఖపట్నం**

సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజైన శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో వరుసగా భేటీ అయ్యారు. ముందుగా ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబిలిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కాకినాడ లేదంటే మూలపేటల్లో ఎల్జీ కెమ్ నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకు రావాలని సీఎం ఈ సందర్భంగా ప్రతిపాదించారు. జేఎస్‌డబ్ల్యుతో కలిసి ఎల్జీ కెమ్ ఏర్పాటు - మిగతా3లో











# అమరావతి రాజధాని మాత్రమే కాదు

## భవిష్యత్తు తరాలకు స్థిరమైన వారసత్వం

## సీఐఐ సదస్సులో మంత్రి నారాయణ



**విశాఖపట్నం**

అమరావతి రాజధానిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేసారు..అమరావతి నిర్మాణం ద్వారా భవిష్యత్తు తరాలకు స్థిరమైన రాజధానిని అందిస్తున్నామన్నారు...విశాఖలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్లీనరీ సెషన్ లో స్థిరమైన నగరాలు %-% ఫ్రం విజన్ టు ఇన్వెస్ట్మెంట్స్ అనే అంశంపై మంత్రి నారాయణ ప్రసంగించారు...అమరావతి ప్రజారాజధానిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను దేశవిదేశాల పారిశ్రామికవేత్తలకు మంత్రి నారాయణ వివరించారు...అటు అమరావతిపై నిపుణులతో పాటు పెట్టుబడిదారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.సదస్సులో మంత్రి నారాయణ అమరావతిపై ఇంకా ఏమన్నారంటే.. అమరావతి ప్రజా రాజధాని 217 చ. కి.మీ.విస్తీర్ణంతో దేశంలోని రాజధాని - మిగతా3లో

# పుట్టపర్తి లో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి మహా సమాధిని దర్శించుకున్న కేంద్ర మంత్రివర్యులు పీయుష్ గోయల్

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి నవంబర్ 15**



భారత ప్రభుత్వ వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ గౌరవ మంత్రి వర్యులు పీయుష్ గోయల్ ఈ సాయంత్రం పుట్టపర్తి ప్రశాంతినిలయానికి విచ్చేసి భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి మహా సమాధి వద్ద భక్తిపూర్వక ప్రార్థనలు చేశారు. 2016లో తొలిసారి ప్రశాంతినిలయానికి వచ్చినప్పుడు అనుభవించిన ఆ దివ్యానుభూతి, తిరిగి అడుగు పెట్టగానే మళ్లీ తన హృదయాన్ని అలుముకుందని ఆయన సంతోషంగా పంచుకున్నారు. భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి జన్మ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. భగవాన్ సందేశాన్ని, వారి పవిత్ర సేవా మిషన్‌ను ప్రపంచానికి చాటుకోవడంలో శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న నిరంతర కృషిని పీయూష్ గోయల్ హృదయపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ ప్రసంగిస్తూ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారు ప్రతి హృదయంలో నాటిన మానవ విలువలను %-% "అందరినీ ప్రేమించండి, అందరినీ సేవించండి "హెల్ప్ ఎవర్ హర్ట్ నెవెర్ " - అన్న దివ్య - మిగతా2లో

# కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరు



- సూరత్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు..

# తిరుమల వెంకన్నను దర్శించుకున్న శ్రీ చరణ్ రెడ్డి

## భారత క్రికెటర్ శ్రీచరణి రెడ్డికి టీటీడీ చైర్మన్ అభినందనలు

**అంకుశం ప్రతినిధి తిరుమల నవంబర్ 15**



భారత మహిళా క్రికెటర్ శ్రీ చరణ్ రెడ్డి తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారుఇటీవల జరిగిన మహిళా క్రికెట్ వరల్డ్ కప్ లో భారత్ జట్టు ఘన విజయం సాధించడంలో కీలకపాత్ర వహించిన కడప జిల్లాకు చెందిన భారత మహిళా క్రికెటర్ శ్రీ చరణి రెడ్డిని టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు అభినందించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం శ్రీచరణి రెడ్డిశనివారం తిరుమలలోని క్యాంప్ కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడును మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆమెను శాలువతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో భవిష్యత్తు లో క్రికెట్లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఈ సందర్భంగా చైర్మన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి కూడా పాల్గొని శ్రీచరణి రెడ్డికి అభినందనలు తెలిపారు.

# ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరం



- ఓటు హక్కు: జెన్ జెడ్ యువతకు నటుడు విజయ్ కీలక సందేశం
- వీడియోను విడుదల చేసిన నటుడు విజయ్
- ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచన
- రాజ్యాంగం ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కులలో ఓటు హక్కు ఒకటి అన్న విజయ్


# ఎల్ఆర్ఎస్‌కు జనవరి 23 వరకు గడువు



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువును వచ్చే ఏడాది జనవరి 23 వరకు పొడిగించింది. అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ఇది మంచి అవకాశం. 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఇంటి స్థలాలకు ఓపెన్ స్పేస్ ఛార్జీలో 50% రాయితీ కూడా అందిస్తున్నారు. ఈలోపు అనధికారికంగా ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎల్ఆర్ఎస్ ద్వారా అనధికార లేఔట్లలో స్థలాలు కొన్న వారికి మంచి అవకాశం వచ్చిందనే చెప్పాలి. కొంతమంది అమాయకంగా అనుమతులు లేని లేఔట్‌లలో స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఈఎంఐ ఆప్షన్, తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేయడం వల్లే ఇలా జరుగుతోంది. వారికి కూడా ఎల్ఆర్ఎస్‌తో ఎంతో ఉపయోగం. ఇలా అనధికారిక లేఔట్‌లో స్థలాలు కొనుగోలుచేసేవారు ఎల్ఆర్ఎస్ వినియోగించుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించింది. వాస్తవానికి ఎల్ఆర్ఎస్ గడువు ఈ ఏడాది అక్టోబర్ 23 పూర్తైంది.. కానీ మరోసారి 2026 జనవరి 23 వరకు పొడిగించింది. దీని కోసంఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వం చెప్పిన పీనలైజేషన్, ఇతరత్రా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.


స్థలం మీదే మీకు హక్కు ఉందని చూపించడానికి, 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ పత్రాలతో పాటు, మీ స్థలం ఎంత ఉందో, దాని చుట్టూ ఏమున్నాయో, పక్కనున్న రోడ్లు ఎంత వెడల్పు ఉన్నాయో తెలిపే సైట్ ప్లాన్‌ను కూడా జతచేయాలి. అంతేకాకుండా, సబ్‌రిజిస్ట్రార్ సంతకం చేసిన ఈసీ మరియు మార్కెట్ విలువ సర్టిఫికేట్ కూడా అవసరం. భూమిని ఒక అవసరం నుంచి మరో అవసరానికి మార్చినట్లు తెలిపే ల్యాండ్ యూజ్ కన్వర్షన్ సర్టిఫికేట్ కూడా చూపించాలి. వీటితో పాటు, ఏదైనా నష్టం జరిగితే బాధ్యత వహిస్తామని తెలిపే ఇండెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణ కోసం చేసుకున్న ఒప్పంద పత్రం కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పత్రాలన్నీ సమర్పించడం ద్వారా స్థలంపై మీ యాజమాన్యాన్ని ధృవీకరించుకోవచ్చు.ఒకవేళ ఎల్ఆర్ఎస్ కింద ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించుకుంటే.. వారికి ప్రభుత్వం బంపరాఫర్ ప్రకటించింది. ఓపెన్ స్పేస్ ఛార్జిలో 50% రాయితీ ఇస్తోంది. ఖాళీ స్థలాలపై నిబంధనల ప్రకారం 14% ఛార్జీలు ఉంటే.. ప్రస్తుతం 7% చెల్లిస్తే సరిపోతుంది. ఈ దరఖాస్తులు భారీగా వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని.. ప్రభుత్వం మరోసారి గడువు పెంచే అవకాశం లేదంటున్నారు. ఒకవేళ క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. అనధికారిక లేఔట్లలో నిర్మాణాలు చేపట్టాలంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వదు. ఒకవేళ ఎవరైనా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా చట్టవిరుద్ధం.. వాటిని కూల్చేస్తారు. అమ్మకాలు, కొనుగోలుకు ఛాన్స్ లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల జాబితాలో చేర్చేస్తారు. అలాగే ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వేయరు. ఒకవేళ ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే.. బ్యాంకుల నుంచి రుణాలు కూడా రావు. తాత్కాలిక నిర్మాణాలకు కూడా నంబర్లు ఇవ్వరు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఆ లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించదు.

# సత్తా చాటిన విశాఖ పోర్టు



**విశాఖపట్టణం :** విశాఖ పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛత కార్యక్రమాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2024 ఏడాదికి గానూ.. ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. విశాఖ పోర్టు అథారిటీ.. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, మొక్కలు నాటడం, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని పోర్టు ఛైర్మన్ ఎం అంగముత్తు తెలిపారు. గతేడాది మూడో స్థానంలో నిలిచిన విశాఖ పోర్టు.. ఈసారి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.విశాఖపట్నం పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛ కార్యక్రమాల్లో విశాఖ పోర్టు అథారిటీ .. దేశంలోని పరిశ్రమల విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న మేజర్ పోర్టులతో పోటీపడీ మరీ తొలి స్థానంలో నిలిచింది. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్.. విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తుకు స్వచ్ఛత అవార్డు ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ కార్యక్రమంలో.. 2024 ఏడాదికి గానూ విశాఖ పోర్టుకు ఈ అవార్డు లభించింది.అవార్డు తీసుకున్న సందర్భందా ఎం అంగముత్తు మాట్లాడారు. పోర్టులో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రం సూచించిన విధంగా మొక్కలు నాటించి, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. కాగా స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ 2023 ఎడిషన్‌లో.. విశాఖ పోర్టు జాతీయ స్థాయిలో మూడవ స్థానాన్ని దక్కించుకుందని తెలిపారు. ఈసారి ప్రధాన ఓడరేవులతో పోటీ పడి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. స్వచ్ఛత మిషన్ పట్ల వీపీఏ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనం అని చెప్పారు. దాని వల్లే వీపీఏ.. 2024లో అగ్రస్థానానికి చేరుకుందన్నారు.ఈ స్వచ్ఛత అవార్డు.. పర్యావరణ సంరక్షణ, స్థిరమైన ఓడరేవు కార్యకలాపాల్లో.. విశాఖ పోర్టు నాయకత్వాన్ని బలోపేతం చేసిందని అంగముత్తు పేర్కొన్నారు. ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, పీపీపీ నిర్వాహకులు, కార్మిక సంఘాల నాయకుల సహాయ, సహకారాలతో ఇలాంటి లక్ష్యాలు సాధిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ ఎస్ఎస్ఆర్‌సీ మూర్తి, సీఎంఈ రాంప్రసాద్, సీఎంఓ డాక్టర్ ఎస్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, గతేడాది విశాఖపట్నం పోర్టు సరికొత్త రికార్డు సృష్టించింది. సరుకు రవాణాకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో.. 249 రోజులకు గానూ 55 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసినట్లు ఎం అంగముత్తు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు విశాఖ పోర్టు ద్వారా రవాణా చేశామన్నారు. విశాఖపట్నం పోర్టు చరిత్రలో ఇదే ఇప్పటి వరకూ అత్యధికమని వెల్లడించరారు. అయితే ఈ క్రమంలోనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయాలని విశాఖపట్నం పోర్టు లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 82.62 టన్నుల సరుకు రవాణా చేసింది. గతేడాది కంటే ఇది 6 శాతం ఎక్కువ.

# సీఐఐ సదస్సులో కనిపించని మిత్రపక్షాలు




**విశాఖపట్టణం :** విశాఖలో పెట్టుబడుల సదస్సు ప్రారంభం అయింది. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ వేదికగా ఈ సదస్సు రెండు రోజులపాటు కొనసాగుతోంది. ప్రపంచం నలుమూలల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. గత కొంతకాలంగా ఏపీ ప్రభుత్వం ఈ సదస్సుకు సన్నాహాలు ప్రారంభించింది. సీఎంతో పాటు మంత్రులు స్వయంగా వెళ్లి ఆహ్వానాలు అందించారు. దాదాపు పది లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రావడం లేదా? అనే వార్త హల్చల్ చేస్తోంది. పౌర సంబంధాల శాఖ విడుదల చేసిన అతిథుల జాబితాలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరు లేకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతుంది. అసలు పవన్ వస్తారా? రారా? అనేది స్పష్టత లేకుండా పోయింది. గత కొద్ది రోజులుగా అటవీ శాఖ భూముల పరిశీలనతో పాటు ఎర్రచందనం నిల్వలను పరిశీలించారు పవన్ కళ్యాణ్. ఏకంగా వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించిన భూముల వీడియోలను తీసి మంత్రివర్గ సహచరులకు చూపించారు. గత రెండు రోజులుగా రాజకీయంగా సైతం హాట్ టాపిక్ అవుతున్నారు.అయితే కూటమి ప్రభుత్వ విధానాలు చూస్తుంటే ఒక అంశం స్పష్టంగా కనిపిస్తుంది. సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయంగా డ్యామేజ్ జరిగినప్పుడు బయటకు వస్తున్నారు. అటు లోకేష్ తెలుగుదేశం పార్టీ బాధ్యతలను తన శాఖ ప్రగతి, ఏపీకి పెట్టుబడులు, విదేశీ వ్యవహారాలను చూస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఇలా కీలక బాధ్యతల్లో సర్దుబాటు అయ్యారు. పవన్ కళ్యాణ్ కదలికలు చూస్తే ఆయన గ్రామీణ ప్రాంత అభివృద్ధి, పర్యటనలు చేస్తున్నారు. అయితే విదేశాల నుంచి పరిశ్రమలతో పాటు పెట్టుబడులు తెచ్చే బాధ్యతను లోకేష్ తీసుకున్నారు. అయితే ఈ విషయంలో చక్కటి సమన్వయం కనిపిస్తోంది. విభిన్న ప్రకటనలు, నిర్ణయాలు ప్రకటించక పోవడాన్ని మనం గుర్తించాలి. ముఖ్యంగా ఇది అనుకునే చేస్తున్నదే.విశాఖ పెట్టుబడుల సదస్సుకు సంబంధించి ప్రభుత్వం పౌర సంబంధాల శాఖ ద్వారా భారీగా ప్రకటనలు ఇచ్చింది. అయితే ఈ యాడ్లలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు ఈ ప్రకటన ఇస్తున్నట్టు అందులో ఉంది. మరి ప్రకటనల్లోనే పవన్ కళ్యాణ్ కు అంత ప్రాధాన్యం ఉంటే.. కచ్చితంగా ఆయన సదస్సుకు హాజరవుతారని అంతా భావించారు. కానీ అతిథుల జాబితాలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, నాదేండ్ల మనోహర్, టీజీ భరత్ తో పాటు సిఐఐ కోఆర్డినేటర్ల పేర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పవన్ కళ్యాణ్ ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం లేదా అనే చర్చ నడుస్తోంది. వైసీపీ అనుకూల మీడియా అయితే దీనిని హైలెట్ చేస్తోంది. క్రమేపి పవన్ కళ్యాణ్ ని సైడ్ చేస్తున్నట్లు చెప్పుకొస్తోంది.

## పుట్టపర్తి లో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి మహా సమాధిని దర్శించుకున్న కేంద్ర మంత్రివర్యులు పీయుష్ గోయల్

-మొదటిపేజీ తరువాయి

సందేశాల్ని ఎంతో ప్రేమగా స్మరించారు. ఈ విలువలను సమాజంతో పంచుకోవడం ఎంతో ముఖ్యమని, ఇవే భారతదేశానికి నిజమైన బలం మరియు మార్గదర్శక కాంతి అని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భగవాన్ వారి జన్మ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందని , భవిష్యత్తులో పుట్టపర్తికి మరింత తరచుగా రావాలని ఉందన్న తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. సేవాదళ్ సభ్యులు, భక్తులు మరియు శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న విశిష్ట సేవలను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, భగవాన్ ప్రేమ మరియు నిస్వార్థ సేవా సందేశాన్నిప్రశాంతినిలయం ద్వారా అనేక కార్యక్రమాల ద్వారా ప్రపంచమంతటా వ్యాప్తి చేయడం అభినందనీయమని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

## వరల్డ్ ఎకనమిక ఫోరంతో ఏపీ కీలక ఒప్పందం

-మొదటిపేజీ తరువాయి

చేయదలిచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఏపీ సర్క్యులర్ ఎకానమీ పాలసీలో భాగంగా ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు వీలుందని సీఎం సూచించారు. డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్... ఇలా అన్ని రంగాల్లో ఏపీ ముందుకెళ్తోందని వివరించిన సీఎం... అబుదాబి తరహాలో రాష్ట్రంలో ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇందులో భాగస్వామి కావాలని యున్జోకోను కోరారు. ఇఫ్కో ఛైర్మన్ దిలీప్ ననూభాయ్ సంఘానీతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ఆధారిత ఫెర్టిలైజర్ ప్లాంట్ల ఏర్పాటు, రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించే అంశాలపై చర్చించారు. బయో%-%ఫర్టిలైజర్, బయో%-%స్టిమ్యులెంట్ యూనిట్ల స్థాపనకు ఉన్న అవకాశాల పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు మేలు చేకూరే విధంగా ఇఫ్కోతో కలిసి పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. పర్యాటక రంగంలో ప్రముఖ సంస్థ కోర్డెలియా క్రూయిజెస్ ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ తీర పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని, ఇందుకు కోర్డెలియా క్రూయిజెస్ కలిసి రావాలని ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈవో జుర్గెన్ బైలామ్‌ను సీఎం కోరారు. సీఎం చంద్రబాబు సమక్షంలో 48 ఎంఓయూలు చేసుకున్నారు. ఎంఓయూల కార్యక్రమానికి మంత్రులు కందుల దుర్గేష్, టీజీ భరత్, సవిత, సీఎస్ విజయానంద్ హాజరయ్యారు. అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు సంబంధించి రూ.1,980 కోట్ల ఒప్పందం. ఇంధన భద్రత కోసం మెరుగైన రక్షణ విధానాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శ్రీ సిటీకి 6వేల ఎకరాలు భూములిస్తాం... అభివద్ధికి మోడల్ గా తీర్చిదిద్దుతాం. రేమాండ్ ప్రాజెక్టులకు శంకుస్థాపన, శ్రీసిటీలో కంపెనీల ప్రారంభోత్స సదస్సులో ముఖ్యమంత్రి. రూ.1201 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు చేసే రేమాండ్ ప్రాజెక్టులకు సీఎం శంకుస్థాపన. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యాన్ని త్వరలోనే చేరుకుంటాం. రాయలసీమలో ఇప్పటికే చాలా పరిశ్రమలు వచ్చాయి. 2014%-%2019 మధ్యకాలంలోనే కియా కార్ల ఫ్యాక్టరీని తెచ్చాం. ఇక రాయలసీమ ప్రాంతంలోనే డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటివి ఏర్పాటు చేస్తున్నాం. ఏరోస్పేస్, డిఫెన్సు కారిడార్లు వస్తున్నాయి. ఇప్పుడు అనంతపురం జిల్లాకు రేమాండ్స్ సంస్థ వచ్చింది.. పెట్టుబడులు పెడుతోంది. కియా దగ్గర్లోనే రేమాండ్స్ సంస్థ ఆటో కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంటును రేమాండ్స్ ఏర్పాటు చేయబోతోంది. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న లక్ష్యాన్ని వచ్చే 3%-%4 ఏళ్లలోనే చేరుకుంటాం. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. 2027 నాటికి ప్రస్తుతం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను ప్రారంభిస్తామని రేమాండ్ హామీ ఇచ్చింది. మొత్తంగా రూ.1201 కోట్ల పెట్టుబడులతో మూడు వేర్వేరు పరిశ్రమల్ని ద్వారా 6500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయి. విమానాల వినియోగం పెరుగుతున్న దష్ట్యా వాటి ఉత్పత్తి కూడా మరింత పెరగాలి. రేమాండ్ గ్రూప్ ఏరోస్పేస్, రక్షణ అవసరాలను తీర్చేలా ఉత్పత్తులు తయారు చేయటం అభినందనీయం.” అని ముఖ్యమంత్రి అన్నారు. కార్యక్రమాల్లో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ కె.విజయానంద్, రేమాండ్స్ గ్రూప్ కార్పోరేట్ డెవలప్మెంట్ హెడ్ జతిన్ ఖన్నా, శ్రీసిటీ ఎండీ రవిసానారెడ్డి, సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమరావతి రాజధాని మాత్రమే కాదు..

-మొదటిపేజీ తరువాయి

నగరాల్లో ప్రత్యేకంగా నిలుస్తుంది - దేశంలోని అతిపెద్ద ల్యాండ్ పూలింగ్ పథకంలో స్వచ్ఛందంగా పాల్గొన్న 29,000 కంటే ఎక్కువ మంది రైతుల నుంచి అమరావతి జన్మించిందన్నారు. అఖండ మద్దతు నుండి జన్మించింది.అమరావతిని ఆర్థికంగా, శక్తివంతమైన, పర్యావరణపరంగా స్థిరమైన,రాబోయే తరాలకు అవకాశాలను సష్టించేలా నిర్మిస్తున్నామన్నారు.. 2050 వ సంవత్సరం నాటికి 3.5మిలియన్ల జనాభాతో 35బిలియన్ డాలర్ల జీడీపీ తో 1.5 మిలియన్ల ఉపాధి అవకాశాలు కల్పించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం.సింగపూర్ ప్రభుత్వం ఇచ్చిన మాస్టర్ ప్లాన్ తో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో అమరావతి నిర్మాణం జరుగుతుందని మంత్రి అన్నారు...సుమారు 90 కిమీ పొడవైన ఇన్నర్ రింగ్ రోడ్డు,190 కిమీల మేర ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే అనుమతి వచ్చింది. దేశంలోనే రద్దీగా ఉండే విజయవాడ రైల్వే స్టేషన్ కేవలం 10 కిమీల మేర ఉండగా....కొత్తగా నిర్మిస్తున్న హైదరాబాద్ %-% నంబూరు రైల్వే లైన్ కేపిటల్ సిటీని ఆనుకుని వెళుతుందన్నారు..గన్నవరం ఎయిర్ పోర్ట్ తో పాటు కొత్తగా మరో అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు మచిలీపట్నం పోర్టు కనెక్టవిటీ అమరావతికి ఉంది..30 శాతం బ్లూ %-%గ్రీన్ రాజధానిగా 7 సహజమైన ద్వీపాలు,21 కి మీ నదీ తీరం అమరావతిని అత్యంత అనుకూల వాతావరణం ఉన్న రాజధానిగా మారుస్తాయన్నారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణతో పాటు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,సీఐఐ ప్రతినిధులతో పాటు పలువురు ప్రముఖ పెట్టుబడిదారులు పాల్గొన్నారు.

## కీలక మలుపులు తిరుగుతున్న పరకామణికేసు

**తిరుమల :** తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక ఫిర్యాదుదారు సతీష్ కుమార్ అనుమానాస్పదంగా చనిపోయారు. ఆయన మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్ఓ). ఈ ఘటన నవంబర్ 13, 2025న జరిగింది. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం వద్ద రైల్వే ట్రాక్ మీద ఆయన మృతదేహం దొరికింది. సతీష్ కుమార్ వయసు 45 సంవత్సరాలు. తిరుపతి సమీపంలో నివసించేవారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు మృతదేహాన్ని చూశారు. రైలు ఢీకొని చనిపోయినట్లు కనిపించినా, శరీరంపై గాయాలు అసహజంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తాడిపత్రి పోలీసులు అనుమానాస్పద మరణం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. కుటుంబ సభ్యులు ఆత్మహత్య కాదని, హత్యే అని చెబుతున్నారు. పరకామణి చోరీ కేసు 2023 ఏప్రిల్‌లో మొదలైంది. భక్తులు సమర్పించిన బంగారు, నగలు, విదేశీడాలర్లను రవికుమార్ అనే పెద్దజీయర్ మఠం ఉద్యోగి దొంగిలిస్తూండగా పట్టుకున్నారు. ఆయనపై సతీష్ కుమార్ మొదటి ఫిర్యాదు చేశారు. పెద్ద జీయర్ మఠం గుమస్తా రవి కుమార్ 920 అమెరికన్ డాలర్లు దొంగిలిస్తూ దొరికిపోయారని కేసు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత ఆయన రవికుమార్ తో లోక్ అదాలత్ లో రాజీ చేసుకున్నారు. దొంగతో రాజీ చేసుకోవడం ఏమిటన్న విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2025 అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశంతో సీఐడీ దర్యాప్తు మొదలైంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో బృందం విచారణ ప్రారంభించారు. రవికుమార్ ఆస్తులను కొన్ని టీటీడీ పేరన రిజిస్టర్ చేసి..మిగతా పెద్ద మొత్తంలో ఆస్తులను ఇతర వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ అధికారులు స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. సతీష్ కుమార్‌ను నవంబర్ 6న తిరుపతి పద్మావతి అతిథి గృహంలో విచారించారు. మరోసారి హాజరు కావాలని నోటీసు ఇచ్చారు. ఆ తర్వాతే ఆయన చనిపోయారు. దీంతో హత్య అనుమానం పెరిగింది.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి...

**జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ**



**అంకుశం న్యూస్అనంతపురం, నవంబర్ 15** :రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూపాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఉద్యోగ సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా సమాజంలోని ప్రజలందరూసామాజిక బాధ్యతగా గుర్తించి పారిశుద్ధ్య పనులపైప్రత్యేకశ్రద్ధతీసుకోవాలని తెలిపారు. పరిశుభ్రతను వ్యక్తిగత బాధ్యతగా, సామాజిక కర్తవంగా భావించి ప్రతి ఒక్కరు తమ పరిధిలో ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పరిశుభ్రత వాతావరణం ద్వారా ఆరోగ్యకర జీవనంతో పాటు సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి చేత మన ఆంధ్ర ప్రదేశ్ ను స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయంగా తమ వంతు కృషి చేయాలంటూ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్ వివిధ విభాగాలకు చెందిన పర్యవేక్షకులు డిప్యూటీ తాసిల్దారులు తదితరులు పాల్గొన్నారు.


## రెడ్‌బుక్ పేరుతో అరాచకాలు

**- హిందూపురం వైసీపీ కార్యాలయంపై దాడిని ఖండించిన అనంత వెంకటరామిరెడ్డి**



**అంకుశం న్యూస్ అనంతపురం, నవంబర్ 15** : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్‌బుక్ పేరుతో అరాచకాలు సృష్టిస్తున్నారని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే శనివారం హిందూపురంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై టీడీపీ గూండాల దాడి జరిగిందన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వైసీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి బాధ్యులు ఎవరో సీసీ కెమెరాల్లో రికార్డయి ఉందని, తక్షణం వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని పోలీసుశాఖను కోరారు. ప్రజలకు మంచి చేయడం చేతగాక ప్రశ్నిస్తే ఇలా పార్టీ కార్యాలయంపై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేయడం, సిబ్బందిని విచక్షణా రహితంగా కొట్టడం హేయనీయమని పేర్కొన్నారు. ఈ రోజు అధికారం ఉందన్న అహంతో రెచ్చిపోతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్‌లో తప్పకుండా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఎన్నో జరిగాయన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో నారా లోకేష్ అరాచకశక్తులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పోలీసులు అధికార పార్టీ నేతలకు జీహుజూర్ అంటుండడం వల్లే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. కాలం అన్నింటికీ తప్పకుండా సమాధానం చెబుతుందని, ఈ రోజు మీరు నాటే విత్తనమే భవిష్యత్‌లో మహా వృక్షమవుతుందన్న సంగతి మరచిపోవద్దని హితవు పలికారు.

## అన్నదానం మహాదానం



**రాప్తాడు అంకుశం న్యూస్ నవంబర్ 15:** మండలంలోని మరూరు గ్రామంలో మాలధారణ చేసిన అయ్యప్ప భక్తులకు మరూరు సొసైటీ అధ్యక్షుడు గోనుగుంట్ల గోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవిలు మరూరు చిన్న కదరయ్య దేవాలయంలో అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ భక్తులు అయ్యప్పస్వామివారికి ఉదయాస్తమ సంధ్యలలో పూజలు చేస్తూ ఏకభుక్తం తింటూ 41 రోజుల పాటు దీక్షను కొనసాగిస్తారన్నారు. కఠిన నిమయాల్లో భిక్షకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు.

## ఆలయ పునఃనిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 15:** రంగంపేట మండలం రంగంపేటలో శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి & బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయ పునఃనిర్మాణం సందర్భంగా రాతితో నిర్మాణమును ప్రారంభించిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో రంగంపేట కూటమి నాయకులు, రంగంపేట గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్‌సీపీ యువజన విభాగం కార్యవర్గ సభ్యుడు వీర్రాఘవరెడ్డికి ఎమ్మెల్యే అభినందనలు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 15:** అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన కర్రి వీర్రాఘవరెడ్డి తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్‌సీపీ యువజన విభాగం కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం సాయంత్రం అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. వైయస్ఆర్‌సీపీలో ప్రతి యువజన విభాగం కార్యకర్తనూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే స్థాయిలో గౌరవిస్తామని తెలిపారు. అనంతరం కర్రి వీర్రాఘవరెడ్డిని అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి దుస్సాలువతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్ర రెడ్డి, దుర్గారెడ్డి, వారి మిత్ర బృందం మరియు వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిశుభ్రత పై అవగాహన కల్పించాలి

**- నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛంధ్ర కార్యక్రమం**

**- నగరంలో 95శాతం ప్లాస్టిక్ ను నిర్మూలించామన్న ఎమ్మెల్యే**






**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 15:** పాఠశాల నుంచే పిల్లలకు పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరంలోని 46వ డివిజన్, నాలుగవ రోడ్డులో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ వారం పాఠశాలలో పరిశుభ్రత పై అవగాహన కల్పించే థీమ్ ను ఏర్పాటు చేశారు. ముందుగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని అలాగే మన పరిసరాలను, పాఠశాల ఆవరణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు నీటి వృథా చేయకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతి వారం ఒక క్లాస్ పీరియడ్ పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కేటాయించాలని సూచించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కింది స్థాయి నేత వద్ద నుంచి ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి వరకు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. ఒక్కో వారం ఒక్కో థీంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత వారంలో మార్కెట్లలో చెత్త లేకుండా ఎలా చేసుకోవాలన్న దానిపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇప్పటికే నగరంలో ప్లాస్టిక్ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని...ప్రతి ఒక్కరు క్లాత్ బ్యాగ్ ని ఉపయోగించాలని సూచించారు. 30ఏళ్ల నుంచి నగరంలో సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్ కు పరిష్కారం చూపిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో 2లక్షల 80వేల టన్నులు పెట్టి పోయారని.. ఇప్పటికే చెత్తను తొలగించే కార్యక్రమం శరవేగంగా సాగుతోందన్నారు. డిసెంబర్ చివరినాటికి ఇక్కడ చెత్త లేకుండా చేస్తామన్నారు. ఆ తర్వాత రెండు ఎకరాల్లో వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని.. మరో 10 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ వారు ముందుకు వచ్చినట్లు తెలిపారు. నగరాన్ని అన్ని విధాలుగా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలంతా సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, మెప్మా పిడి విశ్వజ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, కార్పొరేషన్ డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, పోతుల లక్ష్మీనరసింహులు, బెస్త పవన్ కుమార్, కాశీ విశ్వేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నరేంద్ర చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, మాజీ కార్పొరేటర్లు రాజారావు, సరళ, మల్లెల దుర్గేష్, టిడిపి సీనియర్ నాయకుడు సింగవరం రవి, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, తెలుగుమహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, టిఎన్టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మోహన్ కుమార్, బెస్త సాధికార సమితి రాష్ట్ర నాయకుడు చేపల హరి, వాల్మీకి సాధికార సమితి రాష్ట్ర నాయకుడు మణిరవి వాల్మీకి, దత్తాత్రేయ ఆలయ కమిటీ చైర్మన్, టిడిపి నాయకుడు రాయల్ మధు, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వన్నూరప్ప, మాజీ ఎంపీపీ ఇస్మాయిల్, టిడిపి నాయకులు నెట్టెం బాలకృష్ణ, బోయ రాము, హేమంత్, అయేషా, చరిత, శ్రీనివాస్ గౌడ్, ఆటో హబ్ దాదు, కృష్ణం రఘు, గోపాల్, జాఫర్, టిడిపి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# బార్ కౌన్సిల్ ఎన్నికలలో బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ అభ్యర్థులను గెలిపించండి.

**- బహుజన న్యాయవాదులకు, డా. పోతుల నాగరాజు**




**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 15:** న్యాయ వాదుల సమస్యల పరిష్కారం కోసం పని చేసే వారినే ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలలో గెలిపించండి అని బహుజన న్యాయవాదులకు విజ్ఞప్తి చేస్తూ, అదే విదంగా న్యాయ వాదులకు ఉన్న అనేక సమస్యలను ప్రభుత్వం ద్రుష్టికి, ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ద్రుష్టి కి తీసుకెళ్ళి సమస్య పరిష్కారం కోసం పని చేసే వారికీ ఓటు వేయాలని లేకుంటే పదవులను అడ్డుపెట్టుకొని సొంత వ్యాపారం, న్యాయ విద్యా తో వ్యాపారం వ్యక్తి గత పైరవీలు చేసుకొని సొంత కాలేజ్ ల మనుగడ కోసం పని చేసే వారికీ ఈ ఎన్నికలలో ఓడించి బుద్ధి చెప్పండి అని బహుజన న్యాయవాదులకు, రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది డా. పోతుల నాగరాజు పిలుపు నిచ్చారు. న్యాయవాదులకు ప్రతి పట్టణము సొంత ఇంటి నిర్మాణం కోసం ఇళ్ల స్థలము కేటాయించాలని, మెడికల్ సౌకర్యం కోసం 25 లక్షలు రూపాయల వరకు ఉచితంగా న్యాయవాదులకు అందించాలని, కొత్త గా న్యాయవాది వృత్తి లోకి వచ్చిన వారికీ ప్రతి నెల 15 వేల రూపాయలు స్టైఫండ్ ప్రభుత్వం ఇవ్వాలని, అకాల మరణం పొందిన న్యాయవాదుల కుటుంబంకు 50 లక్షలు రూపాయలు పరిహారం అందే విదంగా ప్రభుత్వం బార్ కౌన్సిల్ అఫ్ ఇండియా సహాయం చేయాలని, బార్ కౌన్సిల్ మెంబెర్స్ ఎన్నికల లో కూడా రిజర్వేషన్ అమలు చేయాలని, హైకోర్టు, సుప్రీం కోర్ట్ న్యాయ మూర్తుల నియామకాలలో రిజర్వేషన్ల ను అమలు చేయాలని ఆవిధంగా డిమాండ్ చేసే వారికీ మీ ఓటు వేయాలి అని రాష్ట్రం లో పోటీ లో ఉన్న BC, ST, SC, మైనారిటీ మెంబెర్స్ కు మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి అని ప్రతి బహుజన న్యాయవాద సోదర, సోదరి కి డా. పోతుల నాగరాజు విజ్ఞప్తి చేస్తున్నారు

# పరిశుభ్రత' పై విద్యార్థులు దృష్టి పెట్టాలి

**- జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్**

**- శనివారం జగరాజుపల్లి కేజీబీవీలో విద్యార్థులకు"వాష్ అండ్ క్విట్ ప్రాక్టికల్ డెమో**







**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, నవంబర్ 15 :** ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలలో భాగంగా.. వ్యక్తిగత పరిశుభ్రత మరియు సమాజ పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు శనివారం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పుట్టపర్తి మండలం జగరాజుపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్... పాఠశాల పరిసరాలను పరిశీలించి, జరుగుతున్న శుభ్రత పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్లను సందర్శించి, వారు ఉపయోగించే బెడ్స్, దుప్పట్లు, గదుల పరిశుభ్రత సక్రమంగా ఉందా లేదా అంటూ వార్డెన్‌ను అడిగి సమీక్షించారు. వసతి గృహాల పరిశుభ్రత విద్యార్థుల ఆరోగ్యానికి అత్యంత కీలకమని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ%ా%"చేతులను శుభ్రంగా ఉంచుకోవడం, గోళ్లు కత్తిరించుకోవడం, టాయిలెట్ ఉపయోగించిన తర్వాత చేతులు సరిగా కడుక్కోవడం తప్పనిసరి"అని చెప్పారు. కలెక్టర్ సూచనల మేరకు విద్యార్థుల అవగాహన కోసం"వాష్ అండ్ క్విట్"చేతుల పరిశుభ్రత డెమన్‌స్ట్రేషన్‌ను ప్రాక్టికల్‌గా నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రతలో ఇది కీలకమైన అంశమని, ప్రతి విద్యార్థి దీనిని నిత్యం పాటించాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎవరూ బహిరంగ మలవిసర్జన చేయకుండా చూడాలి. పరిశుభ్రమైన సమాజం నిర్మించడం ప్రతి పౌరుడి బాధ్యత" అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సమత, డీఈఓ కిష్టప్ప, ఎంఈవో, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భగవాన్ సత్యసాయి బాబా మహా సమాధిని దర్శించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి నవంబర్ 15:** భారత ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులు జస్టిస్ బి.ఆర్. గవాయి ఈరోజు మధ్యాహ్నం ప్రశాంతినిలయాన్ని సందర్శించారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే. రత్నాకర్ ఆయనను సాదరంగా ఆహ్వానించి స్వాగతం పలికారు. జస్టిస్ గవాయి గారు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి మహాసమాధి వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు అందించి, 'అఖండ శాంతి నిలయం' అయిన ప్రశాంతినిలయం ప్రసాదించే పవిత్రత, శాంతి, ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు.

## రేపు విజయవాడకు సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ గవాయ్ రాక

**- భారత రాజ్యాంగంపై ప్రసంగం..**



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదివారం విజయవాడకు రానున్నారు. ఉదయం 11 గంటలకు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ప్రసంగిస్తారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో సీఎం చంద్రబాబు కూడా పాల్గొననున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు పాల్గొంటారు.

## మెగా జాబ్ మేళా గోడ పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 15:** అనపర్తిలో నవంబర్ 22వ తేదీన శ్రీ రామారెడ్డి జడ్పీ బాయ్స్ హైస్కూల్ లో మెగా జాబ్ మేళ సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అధికారులు,అనపర్తి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ఇంకా ఈ కార్యక్రమంలో అనపర్తి మండల, అనపర్తి టౌన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమమే చంద్రన్న లక్ష్యం

- ఇమామ్, మౌజన్లకు వేతనాలు చెల్లింపు సందర్భంగా పరిటాల శ్రీరామ్
- ముస్లింలతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన శ్రీరామ్
- శ్రీరామ్ తో మర్యాదపూర్వకంగా భేటి అయిన దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షరీఫ్





**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 15:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలు ప్రవేశపెట్టారనిముస్లిం, మైనార్టీలకు మంచి చేసింది.. చేసేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రాష్ట్రంలో ఇమామ్, మౌజన్ లకు వేతనాలు చెల్లింపుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒకే సారి 2వ విడుతలో 90కోట్లు విడుదల చేసిన సందర్భంగా ముస్లిం, మైనార్టీలతో కలిసి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు మసీదులకు సంబంధించిన ఇమామ్ లు, మౌజన్ లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఇమామ్ కు 10వేలు, మౌజన్ కు 5వేలు చెప్పున ఒక్కొక్క మజీద్ కి 15వేల రూపాయలు ప్రభుత్వం అందిస్తోంది. ఇందులో 12 నెలలకు ఒక్క మసీదుకు లక్షా 80వేలు చొప్పున.. ధర్మవరం పట్టణంలోని 32 మసీదులకు 57లక్షల 60వేలు అందింది. నియోజకవర్గంలో ఉన్న 58 మసీదులకు గాను కోటి 4లక్షల రూపాయలు అందింది. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో తొలి విడుతలో ఇమామ్, మౌజన్లకు 45కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ముస్లిం మైనారిటీలకు హామీ ఇచ్చిన 24 గంటల్లోపే మాట నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు 2వ విడుతలో 90కోట్లు విడుదల చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ముస్లింలను కేవలం ఓటు బ్యాంక్ గా మాత్రమే చూసిందన్నారు. మైనార్టీల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా.. ప్రజల సంక్షేమానికి ఏమాత్రం లోటు చేయడం లేదన్నారు. మరోవైపు దుదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షరీఫ్ పరిటాల శ్రీరామ్ తో మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఇటీవల కార్పొరేషన్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శ్రీరామ్ ను కలిశారు. దూదేకుల్లో చాలా మంది నిరుపేదలు ఉన్నారని.. అలాంటి వారిని గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందేలా చూడాలన్నారు. దూదేకుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీరామ్ అన్నారు...

# మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలి

- కార్తీక వనభోజన మహోత్సవంలో సందడిగా గడిపిన పరిటాల సునీత.
- పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం వద్ద కార్తీక వనభోజన మహోత్సవం.
- ఉసిరి మొక్క నాటి పూజలు చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత






**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 15** మనమందరమునేటి ఆధునిక కాలంలో మన సంస్కృతి సాంప్రదాయాలు, పండుగలను మరువకూడదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు మండల అధికారుల ఆధ్వర్యంలో పండమేరు వెంకటరమణ స్వామి దేవస్థానం వద్ద జరిగిన కార్తీక వనభోజన మహోత్సవం సందడి వాతావరణంలో సాగింది. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, ఎంపిడిఓ విజయలక్ష్మి, ఎమ్మార్వో విజయ కుమారి ఇతర ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే సునీత అధికారులు, మార్కెట్ యార్డు సభ్యులు, మహిళలతో కలిసి ఉసిరి చెట్టు నాటి పూజలు నిర్వహించారు. అనంతరం అధికారులు, నాయకులు, మహిళలతో కలసి ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే సునీత బహుమతులు అందజేశారు. అధికారులు, వంట వారితో కలసి వంటల తయారీలో పాల్గొన్నారు. అతర్వాత అంతా కలిసి సామూహిక వన భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ చాలా మంది నేటి ఆధునిక కాలంలో మన సాంప్రదాయాలను, సంస్కృతిని విస్మరిస్తున్నారన్నారు. అసలు కార్తీక మాసంలో ఇలాంటి వన మహోత్సవాలు నిర్వహిస్తారని చాలా మంది నేటి తరం వారికి తెలియదన్నారు. అధికారులు ఇలాంటి వాటిని గుర్తు చేస్తూ ఈకార్యక్రమాన్ని నిర్వహించారని.. వారిని ప్రత్యేకంగా అభినందించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల వలన




గ్రామాల్లో ఐక్యత ఏర్పడుతుందన్నారు. మనకున్న ఇబ్బందలన్నీ మర్చిపోతే.. అంతా ఒక చోట చేరి వన భోజనం చేస్తే మానసిక సంతోషం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో చివరిలో ఎమ్మెల్యే పరిటాల సునీతను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు...

# అయ్యప్ప స్వామి దేవస్థానంలో అన్నదానాన్ని ప్రారంభించిన బైరెడ్డి, దారపనేని


**కనిగిరి నవంబర్ 15 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలో వెలసి ఉన్న హరిహరపుత్ర శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ప్రతి సంవత్సరం నవంబర్ 15వ తేదీ నుండి జనవరి 15వ తేదీ వరకు ఉచిత అన్నదాన కార్యక్రమం అయ్యప్ప స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న సందర్భంగా పామూరు మాజీ సర్పంచ్ కావిటి వెంకటసుబ్బయ్య, ధర్మపత్ని శ్రీమతి విజయలక్ష్మి, మోపాడు తెలుగుదేశం పార్టీ సీనియర్



నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు ధర్మపత్ని శ్రీమతి ప్రమీల వారి ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని అయ్యప్ప మాల భక్తులకు, ఆంజనేయ స్వామి మాల భక్తులకు, భవాని మాల భక్తులకు, వెంకటేశ్వర స్వామి మాల భక్తులకు అన్నదాన కార్యక్రమం బైరెడ్డి, దారపనేని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవస్థానం చైర్మన్లు గుత్తి వెంకటరాజా, కావిటి వెంకటసుబ్బయ్యలు, రాచూరి సురేష్, ఓగూరి నరసింహారావు, రోశయ్య స్వామి, గోగినేని వెంకటేశ్వర్లు, తిరివీధి హజరత్, దారపనేని నరసింహనాయుడు, యరశింగు రాయుడు, కావిటి నాగేశ్వరరావు దంపతులు, జాజం హరికృష్ణ, అయ్యప్ప స్వామి భక్తులు భారీ సంఖ్యలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో పీయూష్ గోయల్ కి ఘన స్వాగతం..

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి నవంబర్ 15:** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవాలలో పాల్గొనేందుకు శనివారం గౌరవ కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ మంత్రివర్యులు శ్రీ పీయూష్ గోయల్ శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి విచ్చేశారు. పుట్టపర్తి విమానాశ్రయంలో గౌరవ కేంద్ర మంత్రివర్యులు పీయూష్ గోయల్ కి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ప్రముఖ బిజెపి నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.







అనంతరం ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ కు కేంద్ర మంత్రివర్యులు చేరుకున్నారు. శాంతి భవన్ వద్ద ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్, ఇతరులు.. కేంద్ర మంత్రివర్యులకు ఆత్మీయ స్వాగతం పలికారు. కొద్దిసేపు విశ్రాంతి అనంతరం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా గారి మహా సమాధి దర్శనం నిమిత్తం సాయి కుల్వంత్ హాలుకు బయలుదేరి వెళ్లారు.

## దువ్వూరి సుబ్బమ్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి-యాట్ల



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 15:** స్వాతంత్ర్య సమరయోధురాలు ,దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ 145 వ జయంతి సందర్భంగా నేడు ద్రాక్షారామ లో ఆమె చిత్రపటానికి నియోజకవర్గం ఎం.బీ.సి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్ళిన తొలి ఆంధ్ర మహిళ.1880 నవంబర్ 15 న ద్రాక్షారామ లో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సుబ్బమ్మ కు చిన్న తనంలో వివాహం జరిగింది.ఆమె భర్త మరణించడంతో దేశ స్వాతంత్ర్య కోసం ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు.1923 కాకినాడ లో జరిగిన స్వాతంత్రోద్యమ సభలో పాల్గొని అనర్గళంగా మాట్లాడిన ప్రసంగానికి మహాత్మా గాంధీ ఆనందంతో పులకరించి ఆమెకు దేశ బాంధవి అనే బిరుదు ఇచ్చారని తెలిపారు. సుబ్బమ్మ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. త్వరలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి లేఖ వ్రాస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల రమణ శాస్త్రి, మేడిశెట్టి శ్రీనివాస్, కొప్పిశెట్టి కొండలరావు, షేక్ అబ్బాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

## వంద పడకల హాస్పిటల్ నిమిత్తం నాడు చూపించిన మిగతా స్థలం ఎక్కడుందో చూపించండి – ఎమ్మెల్యే నల్లమిల్లి




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 15:** అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమావేశంలో మాట్లాడుతూ ...వంద పడకల హాస్పిటల్ నిర్మాణానికి 2009 – 2014 మధ్యకాలంలో ఒక సింగిల్ పేపర్ ఆర్డర్ తీసుకురావడం జరిగింది. ఎటువంటి బడ్జెట్ లేకుండా ఆరోజు రాజకీయ కారణాలతో ఇస్తే ఈ గ్రామంలోని నివాసం ఉంటున్న స్వయం ప్రకటిత వ్యూహకర్త ఒకరు ఆనాటి శాసనసభ్యులను కాదని వారికి వారే అన్ని కార్యక్రమాలు చేసినట్లుగా ప్రకటించుకోవడం జరిగింది. ఇక్కడ ఏ విధమైన మౌళిక వసతులు లేని పక్షంలో నేను శాసనసభ్యులుగా అయిన తరువాత ముఖ్యమంత్రి గారి చొరవతో ఆరోజు 5.70 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఈ భవనాలను నిర్మాణం చేసాం.గత ఐదు సంవత్సరాలు ఇక్కడ 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయితే ప్రక్కన ఉన్న ప్రైవేట్ హాస్పిటల్ కి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో ఆనాటి ప్రజా నాయకులు ఏ విధంగా కృషి చేశారో మనందరికీ తెలుసు. అటువంటి సమయంలో ఏదైతే 2014-19 కాలంలో వంద పడకల ఆసుపత్రి కోసం ముందుకు తీసుకెళ్లామో అది తప్పనిసరి పరిస్థితిలో విధిలేని పరిస్థితిలో అది మంజూరు అయింది. ఈ పరిస్థితిలో ఇప్పుడు ఇక్కడ ఉన్నది 1.8 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉంది. వంద పడకల ఆసుపత్రి మంజూరు కావాలంటే మూడు ఎకరాల స్థలం కావాలి దాంతో నాటి పాలకులు పక్కన ఉన్న కళా వేదికను కూడా దీనిలో చూపించి మూడు ఎకరాల స్థలం ఇక్కడ అందుబాటులో ఉందని చెప్పి 100 పడకల ఆసుపత్రి మంజూరు చేసుకోవడం జరిగింది. నేను శాసనసభ్యులుగా రెండవసారి అయిన తర్వాత మొట్టమొదటిగా ఇక్కడ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశం పెట్టినప్పుడు ఆనాడు అప్పటికి అనాధికారికంగా ఒక హాస్పటల్ కమిటీ ఉండేది వారిని మీరందరూ కలిసి మూడు ఎకరాలు చూపించారు, ఆ మూడు ఎకరాలు మాకు స్వాధీనం చేయండి, హాస్పిటల్స్ కి తప్పనిసరిగా మిగిలిన నిర్మాణాలు కూడా చేపడుతాం అని కోరగా వారు మౌనం వహించారు. ఇంతవరకు దానిపైన ఏ విధమైన ప్రతిస్పందన వారి దగ్గర నుంచి లేదు. లేని విషయాలను ఉన్నట్లుగా చూపించడం, ఆ విషయాలలో ముందుకు వెళితే వేరే వేరే రాజకీయ కారణాలు వెతుక్కోవడం వారికి పరిపాటిగా మారిన నేపథ్యంలో ఇవాళ బహిరంగంగా ఈ విషయాన్ని చెప్పడం జరుగుతా ఉంది. అదనంగా మనకి ఇంత మొత్తం కావాల్సి వస్తుంది దీనిని మంజూరు చేయించాలంటే ఆనాటి పెద్దలు వంద పడకల హాస్పిటల్ కి ఏదైతే స్థలం చూపించారో గ్రామ పెద్దలు అందరూ కూడా ఆ స్థలాన్ని ప్రభుత్వానికి స్వాధీనం చేస్తే తక్షణమే ముఖ్యమంత్రితో చర్చించి ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలియచేసారు.

## వన సమారాధనలు ప్రజల్లో ఐక్యత, భక్తి భావం పెంపొందిస్తాయి-మాజీ ఎమ్మెల్యే సత్తి

- రామవరం గ్రామ వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు
- రామవరం గ్రామంలో వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో 25వ వన సమారాధన
- కార్తీక వనభోజనానికి సుమారు నాలుగు వేల మంది హాజరు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 15:** అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్సీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ..రామవరం గ్రామ వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన వన సమారాధన కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. ఈరోజు రామవరం గ్రామ వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో జరిగిన 25వ వన సమారాధన కార్యక్రమంలో డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా ప్రారంభమైన ఈ వన సమారాధన కార్యక్రమాన్ని, వైయస్ఆర్సీపీ ఏర్పాటు అయిన తర్వాత గత 24 ఏండ్లుగా వేలాది మందితో నిర్వహిస్తూ, ఈ ఏడాది 25వ సంవత్సరం మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం ప్రశంసనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో కనిపించే సేవా స్ఫూర్తి, భక్తి భావం ఆచరణీయమైనవి. ఇలాంటి వన సమారాధనలు ప్రజల్లో ఐక్యత, సమగ్రతను పెంపొందిస్తాయి అని డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి వ్యాఖ్యానించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం రామవరం గ్రామంలో వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక వన సమారాధనలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. ఈసారి నిర్వహించిన 25వ కార్తీక వన సమారాధనకు సుమారు నాలుగు వేల మంది హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, అనపర్తి నియోజకవర్గం నాలుగు మండలాల వైయస్ఆర్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పలు సంఘాల నాయకులు, రాజకీయ ప్రముఖులు, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా బీర్స ముండా 150 వ జయంతి వేడుకలు !



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 15:** ఘనంగా జరిగిన భగవాన్ బీర్స ముండా 150 వ జయంతి వేడుకలు. విశాలాంధ్ర ధర్మవరంబీబీ ఆదివాసీలు గిరిజనుల ఆరాధ్య దైవం కీర్తిశేషులు భగవాన్ బీర్సా ముండా 150వ జయంతి వేడుకలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరకొండ రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు నవంబర్ 15 -1875 లొ జార?ండ్లొ, ఉలిహాటు అనే గ్రామంలో జన్మించి, ఆదివాసి - గిరిజనులలొ పోరాట భావాలను పాదుకొల్పిన మొట్ట మొదటి వ్యక్తి అని తెలిపారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వయం పాలన కోసం సమర సంఖారావం పూరించిన తొలి బాణం భగవాన్ బీర్స ముండా అని, ఆదివాసి , గిరిజనుల హక్కులకొసం గొంతు విప్పి గర్జించిన సింహం జమిందారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడిన అడవి బిడ్డ అని తెలిపారు. బ్రిటిష్ వారి పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన ధీరుడు - స్వాతంత్ర్య సమరయోధుడు, 22 సంవత్సరాలకె బ్రిటిషర్ల పై యుద్ధ ప్రకటన చేసి కుంతి తామర్ - బసియా - రాంచి ప్రాంతాలలో ఉద్యమాన్ని నడిపారని తెలిపారు. ఆదివాసీ గిరిజనులందరు చదువు కోవాలని ఆరాటపడే వారు అని తెలిపారు. ఈ కార్యక్రమం లొ ఎం - చౌడప్ప, కునుతూరు గోపాల్, వెంకటరమణ స్వామి, గుజ్జల నాగరాజు , సాకే కిరణ్ , కిష్టయ్య , వీర తదితరులు పాల్గొన్నారు.